ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

శనివారం 2 ఆగస్టు 2025



బెలూన్లను ఎగరవేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

క్రీడాకారులు యాంటీ డ్రగ్స్ వారియర్స్‌గా పనిచేయాలి

- ఎస్పీ అశోక్ కుమార్
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ టోర్నమెంట్

8

ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు షురూ

- సర్వర్ మొరాయింపు
- 66.29 శాతం ఎఫ్ఆర్‌సీ హాజరు



బుగ్గారం మండలం సిరికొండలో ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా అటెండెన్స్ వేసుకుంటున్న ఉపాధ్యాయుడు

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు శుక్రవారం ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా అటెండెన్స్ వేసుకో వడానికి ప్రయత్నించారు. అయితే కొన్ని ప్రాంతాల్లో సిగ్నల్స్ సరిగా లేకపోవడం, సర్వర్ మొరాయించడంతో బాలారిష్టాలు ఎదురయ్యాయి. జిల్లావ్యాప్తంగా 66.29 శాతం మంది ఉపాధ్యాయులు ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టంను వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 4,369 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుండగా ఇందులో తమ మొబైల్‌ను 2,896 మంది ఉపాధ్యాయులు రిజిస్టర్ చేసుకున్నారు. సర్వర్ పనిచేయకపోవడం, సిగ్నల్స్ దొరకకపోవడం, లైన్ బిజీగా ఉండడం తదితర కారణాల వల్ల 1,473 మంది ఉపాధ్యాయులు తమ మొబైల్స్‌ను రిజిస్టర్ చేసుకోలేక పోయినట్లు సంబంధిత అధికారవర్గాలు అంటున్నాయి. కాగా జిల్లా కేంద్రంలోని పురాణిపేట ఉన్నత పాఠశాలల్లో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం అమలును జిల్లా విద్యాశాఖ అధికారి రాము పర్యవేక్షించారు. ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందించారు.

ఫే(క్)స్ గుర్తింపు

- పంచాయతీ కార్యదర్శుల హాజరులో అవకతవకలు
- విధులకు ఎగనామం..
- ఏకంగా సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో అప్‌లోడ్ చేసి అడ్డంగా దొరికిన ఓ కార్యదర్శి
- ఇతర కార్యదర్శుల హాజరుపై నిఘా
- జిల్లాలో 24 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు
- సీఎం రేవంత్ ఫొటో అప్‌లోడ్ చేసిన కార్యదర్శి సస్పెన్షన్



ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో అప్‌లోడ్ అయిన తప్పుడు ఫొటోలు, సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోలు



జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు సమయపాలనకు, డుమ్మాలకు చెక్ పెట్టేందుకు పంచాయతీరాజ్‌శాఖ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చింది. సుమారు రెండు నెలలుగా జిల్లాలో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ కొనసాగుతోంది. కార్యదర్శులు విధులు నిర్వర్తించే గ్రామంలో లోకేషన్‌కు వెళ్లి ఫొటో తీసి పంచాయతీ యాప్‌లో నమోదు చేసి అటెండెన్స్ వేసుకోవాలి. అయినా కొందరు పంచాయతీ కార్యదర్శులు ముఖ హాజరుతో మాయాజాలం చేస్తూ విధులకు ఎగనామం పెడుతున్నారు. లోకేషన్‌లో ఫొటో తీసినట్లు అటెండెన్స్ వేసుకుంటూ గ్రామపంచాయతీకి వెళ్లకుండానే సొంత కార్యకలాపాలను చక్క బెట్టుకుం టున్నారు. బుగ్గారం మండలంలోని చందయ్యపల్లి పంచాయతీ కార్యదర్శి ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోను ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ యాప్‌లో అప్‌లోడ్ చేసి ఉన్నతాధికారులకు అడ్డంగా దొరికిపోయాడు. ఈయనతో పాటు జిల్లాలో మరో 24 మంది పంచాయతీ కార్యదర్శులు ఫేక్‌ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ఇచ్చినట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి 25మంది గ్రామపంచాయతీ కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్ వేశారు. ఇటీవల వారిని జిల్లాపంచాయతీ అధికారి గుర్తించారు. దీంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో అప్‌లోడ్ చేసిన చందయ్యపల్లి కార్యదర్శిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు.

డీపీవోలకు యాక్సెస్ లేకపోవడంతో...

జిల్లా వ్యాప్తంగా 385 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో 370మంది కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. పలువురు పంచాయతీ కార్యదర్శులకు మరో గ్రామపంచాయతీ సైత ఇన్‌చార్జి కేటాయించారు. వీరు ప్రతీరోజు ఉదయం 10గంటల వరకు గ్రామ పంచాయతీకి చేరుకొని ఫేస్ రికగ్నిషన్‌యాప్ ద్వారా అటెండెన్స్‌ను ఫోన్‌లో నమోదుచేయాలి. పలువురు పంచాయతీ కార్యదర్శులు విధులకు డుమ్మాలు కొట్టి... గ్రామ పంచాయతీ సిబ్బందికి యాప్‌లాగిన్‌ను ఇచ్చి ఫొటోతో.. ఫొటోతీసి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. సుమారు నెలరోజులుగా పలువురు ఇదే విధంగా హాజరు వేసుకుంటూ డుమ్మా కొడుతున్నారు. అటెండెన్స్‌ను తనిఖీ చేయడానికి డీపీవోలకు యాక్సెస్ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది.

● ఐ ఫోన్‌తో అటెండెన్స్ ట్యాంపరింగ్?

గ్రామ పంచాయతీల్లో పనిచేసే కొందరు కార్యదర్శులు ఐ ఫోన్ ద్వారా ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ట్యాంపరింగ్ చేస్తున్నట్లు అధికారులు పరిశీలనలో వెల్లడైనట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీలకు ఎన్ని గంటలకు వెళ్లినా వారి వద్ద ఉన్న ఐఫోన్‌లో సమయం ఏ విధంగా నమోదు చేసుకొని ఉంటారో ఆ విధంగానే ఫేస్ అటెండెన్స్ తీసుకుంటుంది. ఉదాహరణకు ఒక పంచాయతీ కార్యదర్శి ఉదయం 10గంటలకు పంచాయతీ కార్యలయానికి వెళ్లాల్సి ఉంటే ఆయన ఉదయం 11 గంటలకు వెళ్లి ఐఫోన్ ద్వారా ఫేస్ అటెండెన్స్ వేస్తే అందులో ఉదయం 10 గంటలకు ఉంటే అదే సమయంలో హాజరైనట్లు నమోదు అవుతుంది. ఈ విషయాన్ని పంచాయతీ శాఖ ఉన్నతాధికారులు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. తదనుగుణంగా జిల్లా వ్యాప్తంగా పరిశీలనచేసి ట్యాంపరింగ్ చేసిన కార్యదర్శులపై చర్యలు తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

ఎంపీవోలు, డీపీవోలకు లాగిన్...

నాలుగురోజుల క్రితం ఎంపీవోలు, డీపీవోలకు ప్రత్యేక లాగిన్ ఇచ్చారు. దీంతో యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్న ఫొటో వ్యక్తిదేనా? నేరుగా దిగి అప్‌లోడ్ చేశారా.. ఫొటోను ఫొటోతీసి అప్‌లోడ్ చేశారా..? అని పరిశీలించాలని డీపీవోలను.. (మిగతా 8లో)

ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన కృపాకర్



వెల్గటూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ ఎంపీడీవోగా డి కృపాకర్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన జక్కుల శ్రీనివాస్ పదవీ విరమణ పొందడంతో కోరుట్లలో ఎంపీవోగా విధులు నిర్వహించిన కృపాకర్‌ను వెల్గటూర్ ఎంపీడీవోగా నియమిస్తూ కలెక్టర్ సత్య ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కాగా ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన కృపాకర్‌కు కార్యాలయ సిబ్బందితో పాటు అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

● ఇబ్రహీంపట్నం ఎంపీడీవో గా సలీం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంపీడీవోగా సలీం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. సారంగాపూర్ ఎంపీవోగా పనిచేసిన సలీంకు ఎంపీడీవోగా తాత్కాలిక పదోన్నతి కల్పించి ఇబ్రహీంపట్నంకు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన సలీంకు మండల ప్రత్యేక అధికారి నారాయణ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన రామకృష్ణ సన్మానించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సెర్ప్ ఏపీఎంల బాధ్యతల స్వీకరణ



రాయికల్ ఏపీఎం నరహరి

కథలాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇందిరా క్రాంతి పథకం (సెర్ప్) ఏపీఎంగా చిన్నరాజయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మల్యాల మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా చిన్నరాజయ్య మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతంపై దృష్టిసారించి సిబ్బంది సహకారంతో పనిచేస్తానని తెలిపారు. పొదుపుతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు.

మల్యాల: మల్యాల సెర్ప్ ఏపీఎంగా దేవరాజ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏపీఎంల బదిలీల భాగంగా ఇక్కడ పదేళ్లుగా విధులు నిర్వహిం చిన జీసీ రాజయ్య కథలాపూర్ మండలానికి బదిలీ కాగా మల్లాపూర్ మండలం నుంచి దేవరాజ్ మల్యాలకు బదిలీపై వచ్చారు. సీసీలు, వీవోలు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

వెల్గటూర్: వెల్గటూర్ మండల ఏపీఎంగా తులసీమాత శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏపీఎంగా విధులు నిర్వహించిన చంద్రకళ సారంగాపూర్ మండలంకు బదిలీపై వెళ్లారు. కాగా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఏపీఎంగా విధులు నిర్వహించిన తులసీమాత వెల్గటూర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో మహిళ సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

రాయికల్: రాయికల్ మండల ఏపీఎంగా పోతు నరహరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏపీఎం రాజేష్ బదిలీపై నిర్మల్ జిల్లాకు వెళ్లారు. కథలాపూర్ ఏపీఎంగా పనిచేస్తున్న నరహరి రాయికల్‌కు బదిలీపై వచ్చారు.

ప్రజాసంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం



కొడిమ్యాలలో చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో ఎమ్మెల్యే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 57మంది లబ్ధిదారులకు 57లక్షల 6వేల 621రూపాయల విలువైన కల్యాణలక్ష్మి చెక్‌లను, 18 మందికి ఆరులక్షల 25వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పాటుపడుతుందన్నారు. పేదల సంక్షేమం కోసం పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేయని రేషన్‌కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. అర్హులైన వారంతా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో స్వరూప, ఆర్ఐ కరుణాకర్, కార్యదర్శి వృతవర్ధన్, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిపాల్‌రెడ్డి, ప్రసాద్, మల్లారెడ్డి, భూషణ్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, స్వామి, రవి, నర్సయ్య, గంగన్న, మల్లేశం, రాఘవరెడ్డి, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

మల్యాల (ఆంధ్రజ్యోతి): రాబోయో స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవడానికి కృషిచేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. మండలంలోని రామన్నపేటలో శుక్రవారం మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. తాను నిత్యం అందుబాటులో ఉంటానని సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. మండలంలో మొత్తం స్థానాలు గెలవడానికి ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తిరుపతి, నేరెళ్ల సతీష్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, బండి రవి పాల్గొన్నారు.

అన్ని శాఖల సమన్వయంతోనే ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమన్వయంతోనే 11వ విడత ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం అయినట్లు ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. జూలై నెలలో జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో ఎస్పీ శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 36 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించినట్లు పేర్కొన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరంలో రెండుసార్లు ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించి తప్పిపోయిన బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చుతున్నామన్నారు. జిల్లాలో జూలై నెలలో 36 మంది బాల కార్మికులను గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పరిచామన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ శాఖతో కలిసి ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం చేసిన వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉదయ్ కుమార్



రాయికల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉదయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. రాయికల్ తహసీల్దార్ నాగార్జున ఈ నెల 17 వరకు సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్‌ను రాయికల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. ఈ మేరకు శుక్రవారం విధుల్లో చేరారు.

మూసివేసిన పాఠశాలలో పంచాయతీ కార్యాలయం



మూసివేసిన పాఠశాలలో గల పంచాయతీ కార్యాలయం

మల్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం గుడిపేట గ్రామంలో మూతబడిన పాఠశాల భవనంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం విద్యార్థులు లేక పాఠశాల మూతబడగా సొంత భవనం లేక అరకొర వసతుల మధ్య గ్రామ పంచాయతీ కార్యాలయంను అధికారులు కొనసాగిస్తున్నారు. దీని పక్కనే గ్రామ పంచాయతీ కోసం భవనం నిర్మించినప్పటికీ నిరూపయోగంగా ఉంటుంది.

సెర్ప్ కార్యక్రమాలు బాధ్యతతో పూర్తి చేయాలి

డీఆర్‌డీవో రఘువరణ్



డీఆర్‌డీవోను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కార్యక్రమం కింద జగిత్యాల జిల్లాలోని ఐకేపీ సెర్ప్ ద్వారా అమలుచేస్తున్న కార్యక్రమాలను ఏపీఎంలు బాధ్యతతో పూర్తిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ సూచించారు. జిల్లా డీఆర్‌డీవో కార్యాలయంలో ఇతర మండలాలకు బదిలీ అయిన ఏపీఎంలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో రఘువరణ్ మాట్లాడుతూ సెర్ప్ నిబంధనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సెర్ప్ సిబ్బందికి సాధారణ బదిలీలు జరిగాయన్నారు. కొత్తగా కేటాయించిన మండలాల్లో సెర్ప్ కార్యక్రమాలైన బ్యాంకు లింకేజీ, మార్కెటింగ్, ఫామ్, నాన్‌ఫామ్, స్త్రీనిధి కార్యక్రమాలు, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా కృషిచేసి జిల్లాను ముందంజలో నిలపాలని సూచించారు. అనంతరం ఏపీఎంల బదిలీలు, చేరికలకు సంబంధించిన నియామకపత్రాలను డీఆర్‌డీవో అందజేశారు. అంతకుముందు ఏపీఎంలు మర్యాదపూర్వకంగా డీఆర్‌డీవోకు పుష్పగుచ్ఛం అందించారు. సమావేశంలో ఏపీడీ సునీత, డీపీఎంలు విజయభారతి, నాగేశ్వర్‌రావు, నారాయణ, జిల్లా వింగ్ ఏపీయంలు, మండలాల ఏపీయంలు పాల్గొన్నారు.

బీసీ ఉప ముఖ్యమంత్రిని నియమించాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించాలని పీసీసీ సేవాదళ్ కార్యదర్శి బాగోజి ముఖేష్ ఖన్నా కోరారు. జగిత్యాల పట్టణంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీసీ వ్యక్తిని ఉపముఖ్యమంత్రి చేయాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌లకు లేఖలు రాశామన్నారు. బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీతో జతకట్టి బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో ప్రవేశపెట్టే విధంగా కృషిచేయాలని కోరారు.

ప్రజలు మొక్కలను సంరక్షించుకోవాలి

కొడిమ్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అడవిలోని మైదాన ప్రాంతాల్లో నాటిన ప్రతి మొక్కలను సంరక్షించుకోవాలని కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్ ప్రజలను కోరారు. శుక్రవారం రేంజర్ మాట్లాడుతూ రేంజ్ పరిధిలో 16వ మహోత్సం కార్యక్రమంలో బాగంగా సుమారు 30వేల రకరకాల మొక్కలను నాటామన్నారు. రావి, మర్రి, జువ్వి, తాని, పులిచింత, వేప, జిట్రేగి, ఉసిరి, తెల్లమద్ది, నమిళినార, నల్లగొడిసె తదితర మొక్కలను నాటామన్నారు. వనమహోత్సవంలో 29,664 మొక్కలను నాటడం లక్ష్యంగా కాగా 30వేల పైచిలుకు మొక్కలను నాటామన్నారు. సూరంపేట, కోనాపూర్, గోవిందారం, కాసారం అటవీ ప్రాంతాల్లో మొక్కలను నాటించామని తెలిపారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

కలెక్టర్ సత్యప్రసాద్



విద్యార్థిని విషయ పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

సారంగాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మండల కేంద్రంలో గల బాలికల కస్తూర్బా విద్యాలయాన్ని శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వంట గదిని, పరిసరాలను పరిశీలించి వసతులు బాగుండేల చర్యలు చేపట్టాలని ప్రత్యేకాధికారిని, సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని అన్నారు.

టీచర్‌గా మారిన కలెక్టర్..

టీచర్‌గా మారిన కలెక్టర్ ఎనిమిదో తరగతి విద్యార్థులకు గణితశాస్త్రంలో గల పలు అంశాలను విద్యార్థులకు బోధించి పలు ప్రశ్నలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చక్కగా సమాధానం చెప్పడంతో కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డీఈవో కె రాము, తహసీల్దార్ వహీద్దీన్, ఎంపీడీవో గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులతో కలెక్టర్ ముఖాముఖి

బీర్‌పూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమన్‌పల్లి గ్రామంలో కలెక్టర్ సత్యప్రసాద్ రైతులతో శుక్రవారం ముఖాముఖి చర్చలు జరిపారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ ఆదేశాల మేరకు పైలెట్ గ్రామమైన కోమన్‌పెల్లి గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిసి ముఖాముఖి చర్చలు జరిపారు. పైలెట్ ప్రాజెక్టుపై రైతుల అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. ఇరిగేషన్ ఈఈ, పంచాయతీరాజ్ అధికారులను కెనాల్, రోడ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, సర్వే ఏడీ వెంకటరెడ్డి, తహసీల్దార్ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ ఉమ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థలకు కోడిగుడ్లు సరఫరా టెండర్ ఖరారు

జగిత్యాల,(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ శాఖల ద్వారా నడపబడుచున్న అంగన్‌వాడీ కేంద్రాలు, రెసిడెన్షియల్ పాఠశాలలకు కోడిగుడ్ల సరఫరా టెండర్‌ను ఖరారు చేసినట్లు కలెక్టర్ సత్య ప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కొనుగోలు కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. బిడ్డర్స్ అర్హత, ధరలను బట్టి బిడ్స్ తెరిచి ధరలు ఖరారు చేసినట్లు ప్రకటించారు. అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజు కుమార్, జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుడి మృతి


శ్రీకాంత్(ఫైల్)

జ్యోతినగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో శుక్రవారం నారిశెట్టి శ్రీకాంత్(40) అనే కాంట్రాక్టుకార్మికుడు మృతి చెందాడు. ప్రాజెక్టులోని డీఎం ప్లాంటులో పని చేస్తున్న శ్రీకాంత్ ఉదయంషిఫ్టులో పని చేస్తుండగా అస్వస్థతకు గురై కిందపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీకాంత్‌ను తోటికార్మికులు ఎన్టీపీసీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఉదయ్‌కిరణ్ ఆసుపత్రిలో విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. గోదావరిఖనిలో నివాసం ఉంటున్న శ్రీకాంత్ ప్రాజెక్టులోని డీఎం ప్లాంటులో రాజ్‌కుఎర్ అనే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. విధినిర్వహణలో చనిపోయిన కాంట్రాక్టుకార్మికుడు శ్రీకాంత్ కుటుంబానికి రూ.10లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు, కాంట్రాక్టర్ల మధ్య సాయంత్రం వరకు చర్చలు జరిగాయి. మృతుడి కుటుంబానికి 7 లక్షల రూపాయల నష్టపరిహారం, 50వేలరూపాయలు అంత్యక్రియలకు ఇవ్వాలని, కుటుంబంలో ఇద్దరికి లోకేషన్‌లో పనిఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. చర్చలలో జేఏసీ నాయకులు కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, భూమల్ల చందర్, రాజమల్లయ్య, భూమయ్య, కాంట్రాక్టర్లు ఎ.బి.సి.రెడ్డి, చిగిరి నారాయణ, ఎ.రాజేశం, వి.వెంకటేశ్వర్‌రావు, చందా రాధాకృష్ణారావు, సోమిరెడ్డి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో రామడుగు మండలం వన్నారం గ్రామానికి చెందిన దావు రాజయ్య(65) మృతిచెందాడు. వన్‌టౌన్ సీఐ బిల్ల కోటేశ్వర్ వివరాల ప్రకారం.. కొంత కాలంగా కుటుంబసభ్యులకు దూరంగా ఉంటున్న రాజయ్య కరీంనగర్‌లో కూలీ పని చేసుకుంటూ బస్టాండ్‌లో ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం జగిత్యాల డిపోబస్సు(టీఎస్ 21టి 5353)ను డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి రోడ్డుదాటుతున్న రాజయ్యను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆర్టీసీడ్రైవర్ ముత్యాల గాంధీపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

● చికిత్స పొందుతూ మృతి

బోయినపల్లి ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన బోయినపల్లి మండలం మల్లాపూర్ శివారు గ్రామం రేగులపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అనూషను రామడుగు మండలం కొక్కెరకుంట గ్రామానికి చెందిన బిట్టుతో కొన్ని సంవత్సరాల క్రితం వివాహం అయింది. అత్తమామలతో కాకుండా వేరే కాపురం పెడదామని అనుష భర్తను కోరింది. భర్త నిరాకరించడంతో గతనెల 23న పురుగుల మందు తాగింది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులపల్లి గ్రామానికి చెందిన రాకేష్ (32) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. పెద్దపల్లి రూరల్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాకేష్‌కు ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహమైన ఏడాది అనంతరం మతిస్థిమితం కోల్పోయాడు. మూడేళ్ళ క్రితం భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పెద్దపల్లికి, అక్కడి నుంచి కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ మల్లేష్ తెలిపారు.



రైతుకు ధీమా.. ఇఫ్కో బీమా

ఎరువు బస్తాపై రూ. 10 వేల బీమా

గరిష్టంగా రూ. 2 లక్షల వరకు ప్రయోజనం

చొప్పదండి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతుకు అండగా ఉండాలని ఇఫ్కో ఎరువుల కంపెనీ సంకట హరణ బీమా యోజన పేరుతో ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించింది. వర్షాలు పడుతున్న సమయంలో పొలంలో పనిచేసే రైతులకు ఏదైనా ప్రమాదం జరిగితే వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు ఇఫ్కో ఎరువుల కంపెనీ ఉచితంగా సంకటహరణ బీమా పథకాన్ని తీసుకు వచ్చింది. సహకార సంఘాల ద్వారా ఎరువులు కొనుగోలు చేసే ప్రతి రైతుకు ఈ పథకాన్ని వర్తింప జేస్తున్నారు. ఈ బీమా పథకానికి ప్రత్యేకంగా ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఎరువుల బస్తాలు కొనుగోలు చేస్తే 10 వేల నుంచి 2 లక్షల వరకు ప్రమాద బీమా వర్తింపజేస్తున్నారు.

● బీమా ప్రయోజనాలు

ప్రమాదాల్లో మృతిచెందిన, అంగవైకల్యం సంభవించినా బీమా రైతులకు వర్తిస్తుంది. రైతులు సహకార సంఘాల్లో ఇఫ్కో ఎరువులను కొనుగోలు చేయాలి. ప్రతి ఎరువు బస్తా, నానో యూరియా, డీఏపీ, బాటిల్ కొనుగోలుపై 10 వేల బీమా వర్తిస్తుంది. అత్యధిక బీమా 2 లక్షల పరిమితి ఉంటుంది. ఎరువులను కొనుగోలు చేసిన రైతులు ప్రమాదవశాత్తు మరణిస్తే వందశాతం బీమా, రెండు అవయవాలు కోల్పోతే 50 శాతం బీమా, ఒక అవయవకం కోల్పోతే 25 శాతం బీమా పరిహారం లభిస్తుంది. రోడ్డు ప్రమాదాలు, నీటిలో మునిగిపోవడం, పాము కాటు, గ్యాస్ సిలిండర్ పేలడం, అగ్ని యంత్రాల వల్ల కలిగే ప్రమాదాలకు ఇది వర్తిస్తుంది. రైతులు ఎరవులు కొనుగోలు చేసిన నెల రోజుల నుంచి ఏడాది వరకు ఈ బీమా వర్తిస్తుంది.

● నిబంధనలు

రైతులు ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో రశీదు తప్పనిసరిగా భద్రపర్చుకోవాలి. రశీదుపై కొనుగోలు చేసిన రైతు పేరు, తండ్రి లేదా భర్త పేరు, తేదీ, చిరునామా, ఇఫ్కో ఎరువుల సంఖ్య, నామినీ పేరు, రైతు సంతకం లేదా వేలిముద్ర ఉండాలి. రైతు మరణానికి సంబంధించిన డెత్ సర్టిఫికెట్, మృతి కేసు నమోదైతే ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం రిపోర్టులను సమర్పించాల్సి ఉంటుంది. ప్రమాదం సంభవించిన రోజు నుంచి రెండు నెలల్లోపు ఈ పత్రాలను సికింద్రాబాద్‌లోని ఇఫ్కో టోక్యో అధికారులకు సమర్పించాలి.

రైతులకు ఉపయోగకరం

కళ్లెం తిరుపతిరెడ్డి, ప్యాక్స్ సీఈవో, చొప్పదండి



రైతులకు ఈ బీమా పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. సహకార సంఘం నుంచి ఎరువులను కొనుగోలు చేసిన ప్రతి రైతుకు ఇది వర్తిస్తుంది. రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

జ్యోతినగర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మనెంట్ టౌన్‌షిప్‌లో బుధవారం జరిగిన వలసకార్మికుడు వినోద్ బుబాజి సోన్కర్ హత్య కేసులో నిందితుడు మనోజ్ వర్మార్కర్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు రామగుండం సీఐప్రవీణ్‌కుమార్ తెలిపారు. తోటి కార్మికుడితో 100రూపాయల అప్పు విషయంలో జోక్యం చేసుకున్నందుకే వినోద్‌ను రాడ్‌తో కొట్టి మనోజ్ హత్య చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడిభార్య ప్రతిభ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని 24గంటల వ్యవధిలోనే అరెస్టుచేసినట్లు చెప్పారు. హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకుని, మనో జ్‌ను కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

బోయినపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు బోయినపల్లి పోలీసులు తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన కూర సంపత్ అనే వ్యక్తి ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహిత తన ముగ్గురు పిల్లల్ని శుక్రవారం ఉదయం స్కూల్ బస్సు ఎక్కించేందుకు రోడ్డుపైన వేచిఉంది. అయితే సంపత్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ముస్తాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న డ్రైవర్, ట్రాక్టర్ ఓనర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ శుక్రవారం తెలిపారు. ఆవునూర్ గ్రామపరిధిలోని ఎగువ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసు కను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్ మామిండ్ల పర్శరాములు, అలాగే ఓనర్ పాక రామస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వారిని పట్టుకొని రిమాండ్‌కు పంపినట్లు వివరించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన ఎద్దు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌లో శుక్రవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. గ్రామానికి చెందిన దాడి నర్సయ్య పొలంలో గొర్రు కొట్టేందుకు అదేగ్రామానికి చెందిన అనుముల అంజయ్య తన రెండుఎద్దులతో కూలీకి వెళ్లాడు. గొర్రుకొడుతుండగా పొలంలోఉన్న విద్యుత్ స్తంభం సపోర్టువైరుకు తగలడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. రెండేళ్లుగా రెండు ఎద్దులతో జీవనోపాధి పొందుతున్నాని, మృతిచెందిన ఎద్దును రూ.70వేలతో కొనుగోలు చేశానని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశాడు. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని వేడుకున్నాడు. అనంతరం అధికారులు అక్కడికిచేరుకొని పంచనామా చేశారు.

రూ.7400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7400 పలికింది. శుక్రవారం ఇద్దరు రైతులు 9క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాటద్వార గరిష్ఠధర రూ.7400చెల్లించి పత్తి కొనుగోళ్లుచేపట్టారు. శని,ఆదివారం మార్కెట్‌యార్డుకు సెలవు దినాలు కావడంతో తిరిగి సోమవారం క్రయవిక్రయాలు ప్రారంభంకానున్నట్లు కార్యదర్శి ఆర్‌మల్లేశం తెలిపారు.

ప్రమాదవశాత్తు గ్రానైట్‌క్వారీ సూపర్‌వైజర్ మృతి


దీకొండ రాజు(ఫైల్)

సైదాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగీర్‌పల్లి గ్రామశివారులో గల గంగదేవి గుట్టపై ఉన్న శ్రీలక్ష్మి గ్రానైట్స్‌లో పనిచేస్తున్న దీకొండ రాజు(45) అనే సూపర్‌వైజర్ ప్రమాదవశాత్తు రాయితగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రానికి చెందిన దీకొండరాజు కొంతకాలంగా సైదాపూర్ మండలం జాగీర్‌పల్లి గ్రామశివారులో గల గ్రానైట్‌క్వారీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం రాజు వృత్తిలో భాగంగా గుట్టపై నిర్వహిస్తున్న బండ కటింగ్ వద్దకు పోయాడు. గుట్టపైరాయి కట్‌చేసి ఎక్స్‌కవేటర్‌తో కిందపడేస్తుండగా కొంతదూరంలో ఉండి సెల్‌ఫోన్‌తో రికార్డు చేస్తున్నాడు. ఇంతలో గ్రానైట్ బండకింద ఉన్న బురదలో అందులోని బండరాయి ఎగిరి వేగంగావచ్చి రాజు కనుతకు (తలకు) తగిలింది. దీంతో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన అక్కడే తనతోపాటు పనిచేస్తున్న వర్కర్లు క్వారీ యజమానికి సమాచారం ఇచ్చారు. క్వారా యజమాని రాజు కుటుంబ సభ్యులకు తెలిపాడు. మృతుడు రాజు భార్య దీకొండ సంతోష్‌కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


తునికి శ్రీనివాస్(ఫైల్)

గొల్లపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లె రెవెన్యూ గ్రామ శివారులోని జగిత్యాల-ధర్మారం ప్రధానరహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో గ్రామానికి చెందిన తునికి శ్రీనివాస్(29) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలమేరకు.. గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తునికి రాజనర్సు- అంజవ్వ దంపతుల ఒక్కగానొక్క కొడుకు శ్రీనివాస్. తండ్రి చిన్న తనంలోనే మృతి చెందడంతో తల్లి అన్నీతానై పెంచి చదివించింది. శ్రీరాములపల్లె రెవెన్యూ శివారులోని వెంగళాపూర్ బైపాస్ రోడ్డుసమీపంలో రోడ్డు పక్కన కంకులు కాల్చుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తనతల్లిని రోజూమాదిరి సాయంత్రం ఇంటికి తీసుకురావడానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కొద్దిక్షణాల్లో తల్లి వద్దకు చేరేక్రమంలో వెనకాలనుంచి అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని లారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో శ్రీనివాస్‌రోడ్డుపై పడడంతో లారీఅతడి తలపైనుంచి వెళ్లగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. లారీతోపాటు డ్రైవర్‌అక్కడి నుంచి పారిపోయాడు. ఉన్నఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంరూపంలో కళ్లెదుటే తిరిగిరాని లోకాలకు తరలివెళ్లడంతో తల్లి శ్రీనివాస్ మృతదేహంపై పడి రోదించిన తీరుఅక్కడున్న వారందరినీ కలిచివేసింది. సమాచారం తెలుసు కున్న గొల్లపల్లి పోలీసులు సంఘట నాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో జగిత్యాలజిల్లా ప్రధానాసుపత్రికి తరలించారు. కాగా శ్రీనివాస్ జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓప్రైవేట్‌ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. శ్రీనివాస్ మూడు సంవత్సరాల క్రితం వివాహం చేసుకోగా మూడు నెలల క్రితం ఇద్దరు ఆడ కవల పిల్లలు జన్మించారు. దీంతో శ్రీరాములపల్లెలో తీరని విషాదం అలుముకుంది.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ అమలు

● ఎస్పీ మహేశ్ బి గీతే


రౌడీ షీటర్‌కు పీడీయాక్ట్ నోటీసు అందజేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో మహిళను హత్యచేసిన చందుర్తి మండల కేంద్రానికి చెందిన రౌడీ షీటర్ బొల్లు మనోజ్(20) అనే యువకుడికి పీడీ యాక్ట్ అమలు చేస్తున్నట్లు ఎస్పీ మహేశ్ బి. గీతే తెలిపారు. నిందితుడు మనోజ్‌కు పీడీయాక్ట్ నిర్బంధ ఉత్తర్వులను చందుర్తి సీఐవెంకటేశ్వర్లు శుక్రవారం అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారని ఆయన తెలిపారు. 2023లో ఓ హత్య, దొంగతనం, బెదిరింపులకు పాల్పడిన కేసుల్లో నిందితుడిగా ఉన్న మనోజ్‌పై శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని 2024లో రౌడీషీట్ ఓపెన్ చేశామని తెలిపారు. పలుమార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా మనోజ్ ప్రవర్తనలో మార్పు రాకపోవడమే కాకుండా తరచూ నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నందున కలెక్టర్ పీడీ యాక్ట్ అమలుచేయడానికి ఉత్తర్వులు జారీచేశారన్నారు. జిల్లాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని తెలిపారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

● ఉరి వేసుకుని ఆత్మహత్య


హేమలత(ఫైల్)

మానకొండూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామంలో ఓ వివాహిత వరకట్న వేధింపులు భరించలేక ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన చలిగంటి నాగయ్యతో ఐదేళ్ల క్రితం శంకరపట్నం మండలంలోని మెట్‌పల్లి గ్రామానికి చెందిన హేమలత(24)కు వివాహం అయింది. వివాహ సమయంలో నాలుగు లక్షల నగదుతోపాటు ఇతర లాంఛనాలతో అందించారు. వివాహ అనంతరం భర్త నాగయ్యతో పాటు అత్త పోచమ్మ, ఆడబిడ్డలు రుద్రారపు స్వరూప, ఎల్కపల్లి కొమురమ్మ అదనపు కట్నం కోసం వేధించేవారు. దీంతో ప్రసవానికి తల్లిగారింటికి వెళ్లిన హేమలత బిడ్డకు జన్మనిచ్చింది. ఐదు నెలల క్రితం అత్తగారింటికి వచ్చింది. వరకట్న వేధింపులు అధికం కావడంతో గురువారం రాత్రి ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు హేమలత తల్లి కొయ్యెడ సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదు సంవత్సరాల జైలు శిక్ష

● తీర్పు వెల్లడించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి

వేములవాడ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం చింతలఠాణా ఆర్అండ్ఆర్ కాలనీలో ఇద్దరువ్యక్తులపై అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు హత్యాయత్నం చేసిన సంఘటనలో ఇద్దరికి 5 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ. ఒక వెయ్యి జరిమాన విధిస్తూ అసిస్టెంట్ సేషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ జాదవ్ తీర్పు వెల్లడించారు. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి మండల కేంద్రానికిచెందిన అలువాల శ్రీనివాస్‌కు చింతలఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన భూపతిమల్లయ్య కూతురితో వివాహం చేశారు. అయితే శ్రీనివాస్ భార్య కొద్ది రోజుల క్రితం పురుగుల మందుతాగి మృతిచెందింది. చింతలఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ప్లాట్ వద్దకు శ్రీనివాస్ తనమిత్రుడు మోహన్‌తో కలిసి వెళ్లారు. తన కూతురు మృతికి తన అల్లుడు శ్రీనివాస్ కారణమని అనుమానంతో శ్రీనివాస్, మోహన్‌లపై భూపతి మల్లయ్య, కుమారుడు విజయ్‌లు కలిసి కర్ర, ఇనుపరాడుతో దాడి చేశారని శ్రీనివాస్ తల్లి అలువాల లచ్చవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రఫీక్ ఖాన్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అధికారి సీఐ వెంటకేష్ చార్జ్‌షీట్ దాఖలుచేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అసిస్టెంట్‌సెషన్స్ కోర్టు న్యాయ మూర్తి అజయ్‌కుమార్ జాదవ్ నిందితులకు 5సంవత్సరాల జైలుశిక్షతో పాటుగా రూ.ఒకవెయ్యి జరిమానా విధించినట్లు టౌన్‌సీఐ వీరప్రసాద్ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో ఆవుదూడ మృతి

● పరిశీలించిన అటవీ అధికారులు

తంగళ్లపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో మిడిదొడ్డి రాంచంద్రంకు చెందిన ఆవుదూడపై కుక్కలు దాడి చేయడంతో మృతిచెందింది. గ్రామ శివారులోని పొలం వద్ద దొడ్డిలో ఉన్న ఆవుదూడ శుక్రవారం ఉదయం గాయాలతో మృతిచెంది కనిపించింది. ఆవుదూడపై దాడి చేసింది చిరుత అంటూ ప్రచారం జరిగింది. దీంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చి పరిశీలించి కుక్కలు దాడి చేయడంతో మృతిచెందిందని తేల్చారు.

శతాధిక వృద్ధురాలి మృతి


రాజు(ఫైల్)

రాయికల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారావుపల్లెగ్రామానికి చెందిన దయ్యాల రాజు(110) అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం మృతిచెందింది. ఈమెకు ఆరుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈమెకుమారుడు దయ్యాల బీరమల్లయ్య గతంలో రామారావుపల్లె సర్పంచ్‌గా పనిచేశారు.

పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మునిగాల మణిపాల్‌రెడ్డి

చిగురుమామిడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మునిగాల మణిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుందరగిరిలో గల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన కక్కెర్ల వెంకటమల్లుకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేకరోజులుగా ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రభుత్వాలు మారినా తమ సమస్యలు మాత్రం మారలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అయినా వెంటనే పెండింగ్‌లో ఉన్న తమసమస్యలను పరిష్కరించా లని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాల బాటపట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్‌కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మండల విద్యాధికారి పావణి, మండలపరిషత్ సూపరిండెంట్ ఎండీ ఖాజామొయినోద్దిన్, అన్నిగ్రామాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ దాడి


వేములవాడ తాజ్‌హోటల్‌లో ఆహార నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

వేములవాడ టౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని తాజ్‌ఫ్యామిలీ రెస్టారెంట్‌లో స్టేట్ ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీచేశారు. ఈ సందర్భంగా అధికారులు రోహిత్‌రెడ్డి, శ్రీషిక, స్వాతి, అంకిత్‌రెడ్డి కలిసి తాజ్‌ఫ్యామిలీ రెస్టారెంట్‌లో తనిఖీ చేశారు. రెస్టారెంట్ పూర్తిగా అపరిశుభ్ర వాతవరణంలో భోజనం తయారుచేయడం, కిటికీలకు మెష్ లేకపోవడం, పెస్ట్‌కంట్రోల్ పాటించకపోవడం గుర్తించామని, రిఫ్రిజిరేటర్‌లో నిలువచేసిన మాంసంను ఉత్పత్తులను భారీ మొత్తంలో గుర్తించారు. ఎగ్జాస్టర్ ఫ్యాన్స్‌పై నూనెతో కూడిన దుమ్ము, ధూళి పేరుకుపోయి అపరిశుభ్రంగా గుర్తించారు. కుళ్లిపోయిన ఉడికినగుడ్లు, హానికర రసాయనాలు కలిపిన కృత్రిమ రంగుల బిర్యాని, ఇతరఆహారతయారీకి ఉపయోగించడం గుర్తించామని, రెస్టారెంట్‌లో రూ.20,500 విలువ గల సుమారు 70కేజీల నిలువ ఉంచిన మాంసం, కాలం చెల్లిన టీపొడర్ ఇతర ముడిసరుకులు లేబుల్ డిపుస్స్ కలిగిన కాజు, మసాల పొడులు, మిగిలి ఉంచిన బిర్యాని తదితర వాటిని ప్రజల ఆరోగ్య నిమిత్తం హోటల్ యాజమాన్యాన్ని ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ హెడ్‌జ్యోతిర్మయి హెచ్చరించి అక్కడికక్కడే ధ్వంసం చేయించింది. ఎఫ్ఎస్ఎస్-2006 చట్టం ఉల్లంగించనందుకు హోటల్‌కు నోటీసులు జారీచేశారు. అదే విధంగా మున్సిపల్ అధికారుల సమన్వయంతో హోటల్‌లో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణం ఉన్నందున రూ.30 వేల జరిమానా విధించి తాజ్ రెస్టారెంట్‌ను రెక్టిఫికేషన్ చర్యల నిమిత్తం తాత్కాలికంగా మూసి వేసినట్లు అధికారులు వెల్లడించారు.

సిరిసిల్లలో..

సిరిసిల్ల టౌన్: నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటళ్లపై ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీం హెడ్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ పీ రోహిత్‌రెడ్డి, ఎస్ శ్రీషిక, పీ స్వాతి, వీ అంకిత రెడ్డి బృందం జిల్లాకేంద్రంలోని రుచిహోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. హోటల్లో అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయడం, ఫుడ్ హ్యాండ్లర్స్, గ్లౌజ్, హెయిర్‌క్యాప్స్ ధరించకపోవడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వండిన ఆహారాలపై మూతలు కప్పకపోవడం ఈగలతో కూడిన ఆహారం ఉండడం, మూతలతో కూడిన డస్ట్‌బిన్స్ వాడకపోవడం, పెస్ట్ కంట్రోల్ లేకపోవడం, నాణ్యత లేని ముడిసరుకుల ఉపయోగించడం, ఫంగస్ ఉన్న కూరగాయలను ఉపయోగిస్తున్నారని అధికారులు గుర్తించారు. అదే విధంగా రుచి హోటల్‌కు సంబంధించిన రికార్డ్స్ మెయింటేన్ చేయకపోవడం, ఫుడ్ సేఫ్టీ 2006 నిబంధనలను ఉల్లంఘించినందుకు యాజమాన్యానికి నోటీసులు జారీచేసి జరిమానా విధించారు. కుళ్లిపోయిన పదార్థాలు, ముడిసరుకులను అధికారులు అక్కడే ధ్వంసం చేశారు. అనంతరం అనుమానిత ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు.

ఉరి వేసుకొని టైలర్ ఆత్మహత్య

చొప్పదండి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలోని బీసీకాలనీకిచెందిన దండే పరంధాములు(43) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నా డు. బీసీకాలనీలో టైలరింగ్ పనిచేస్తున్న పరంధాములు మద్యానికి అల వాటుపడి జీవితంపై విరక్తిచెందాడు. గురువారం రాత్రి టైలర్‌షాపులో ఇనుప పైపులకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 6గంటలకు ఇంటినుంచి పరంధాములు వెళ్లి తిరిగి సాయంత్రం వరకు రాకపోవడంతో కొడుకు వెళ్లి టైలర్‌షాపలో చూడగా ఉరి వేసుకొని మరణించి ఉన్నాడు. పరంధాములు భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో మత్స్యకారుడి మృతి

మంథని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులచెరువులో చేపలవేటకు వెళ్లిన స్థానిక బోయినిపేటకుచెందిన మత్స్య కార్మికుడు తాళ్లపల్లి శేఖర్(45) పాముకాటుతో శుక్రవారం మృతిచెందాడు. చెరువులో చేపలవేటకు వెళ్లిన శేఖర్‌ను పాము కాటు వేయగా గమనించలేదు. ఇంటికి వెళ్లిన తర్వాత అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు అతడిని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ వెల్లడించారు. శేఖర్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసహాయం అందజేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

రెండు లారీలు ఢీ: డ్రైవర్ మృతి

సుల్తానాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రెండు లారీలు ఢీకొని రాజస్తాన్‌కు చెందిన లారీ డ్రైవర్ షకీల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళుతున్న లారీ అదే మార్గంలో ఆగి ఉన్న మరో లారీని వెనకవైపు నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ షకీల్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. క్యాబిన్ లో చిక్కుకొని మృతి చెందిన లారీడ్రైవర్ షకీల్ మృతదేహాన్ని ఎక్స్‌కవేటర్‌తో పోలీసులు బయటకు తీశారు. క్లీనర్‌కు తీవ్రగాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐలు శ్రావణ్ కుమార్, అశోక్‌రెడ్డి షకీల్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టంనిమిత్తం ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాటేసే కాలం.. అప్రమత్తతతో.. జర పదిలం



- వర్షాకాలంలో అధికంగా సంచరించనున్న పాములు
- వ్యవసాయ పనుల సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి
- రెస్క్యూ టీంతో పాములు, ప్రజలను రక్షిస్తున్న యువకులు
- పీహెచ్‌సీల్లో అందుబాటులో వ్యాక్సిన్



మంథని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో పాములు అధికంగా సంచరిస్తాయి. వేసవిలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా భూమిలో, పుట్ట ల్లో ఉన్న పాములు వర్షాలు పడిన వెంటనే చల్లటి వాతావరణం కోసం బయటికి వస్తాయి. ఇంట్లో, పరిసరాల ఆవరణలో ఉన్న పిచ్చి మొక్క లు, కట్టెలు, బండ రాళ్లతోపాటు ఇళ్లలోని సూర్లు, రంధ్రాల్లో ఉంటాయి. పాముల సమీపంలోకి వెళ్లడం, చూడకుండ వాటిపై అడుగు వేయడంతో కాటు వేస్తాయి. రాత్రి, పగలు రైతులు పొలాలకు వద్దకు వెళ్లే సమ యంలో పాము కాటుకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో మృత్యువాత పడుతున్నారు. సింగరేణి సంస్థ ఓసీపీ-2 పరిసరాల ప్రాంతాలు, నిర్వాసిత గ్రామాల్లో పాములు సంచారం అధికంగా ఉంటుంది.

19 పాముల రకాల పాముల్లో 4 మాత్రమే విష పూరితం..

మన ప్రాంతంలో 19 రకాల పాములు సంచరిస్తాయి. అయితే వాటి లో నాగుపాము, కట్ల పాము, రక్త పింజర, తుట్టే పురుగు లేదా చిన్న పింజర మాత్రమే విషపూరితమైనవి. వీటిలో రక్తపింజర, కట్ల పాములు కేవలం రాత్రి వేళల్లో మాత్రమే సంచరిస్తాయి. ఆహారమైన కప్పలు, ఎలుకలు, కోడి పిల్లల కోసం నాగు పాములు ఇంట్లోకి, ఆవరణలోకి, పొలాల్లో సంచరిస్తుంటాయి. పామును చూడకుండా తొక్కడం, తాకితేనే అవి కాటు వేసే అవకాశం ఉంటుంది.

విషపూరిత కాట్లను ఎలా గుర్తించాలి..

విష పూరితమైన పాము కాటు వస్తే ఆ ప్రాంతంలో ఒక్కటి లేదా రెండు గాట్లు పడతాయి. రెండు కంటే ఎక్కువ కాట్లు కనిపిస్తే అది విషపూరిత పాము కాదని గమనించాలి.

చికిత్స కోసం ఏ విధంగా స్పందించాలి..

పాము కాటు వేస్తే ఆందోళన పడకుండా ఉండాలి. వేగంగా నడవటం, పరుగెత్తడం చేయవద్దు. కదలకుండా ఒకే చోట కూర్చుని కుటుంబ సభ్యులు లేదా 108 కాల్ చేసి సమీపంలోని ఆసుపత్రికి వెళ్లిచికిత్స పొందాలి. గంటన్నర లోపు చికిత్స అందించాలి. ఆలస్యమయ్యే పరిస్థితి ఉంటే కాటు వేసిన చోట సబ్బుతో కడిగి కాటు వేసిన చోట రక్తస్రావం అయ్యేలా చూడాలి. విషం పైగానికి వెళ్లకుండా తాడు, గుడ్డతో కాటుపై భాగంలో కట్టాలి. నాటు వైద్యం, మంత్రాలు, పసరుల పేరిట కాలయాపన చేయవద్దు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

ఇంటి చుట్టూ చెట్ల పొదలు, కట్టెల కుప్పలు, చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలు లేకుండా జాగ్రత్త పడాలి. ముఖ్యంగా ఎలుకలు లేకుండా ఇంట్లో శుభ్రత పాటించాలి. ఇంట్లో వెల్లుల్లి, కిరోసిన్ వాసన వచ్చే విధంగా చూసుకోవాలి.

సింగరేణి, నిర్వాసిత గ్రామాల్లో పాముల సంచారం అధికం..

సింగరేణి నిర్వాసిత, పరిసరా గ్రామాల్లో పాముల సంచారం అధికంగా ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రామగిరి మండలం బేగంపేట, లద్నాపూర్, ఆదివారంపేట, రామయ్యపల్లె, పన్నూరు, రత్నాపూర్, రాజాపూర్, మంథని మండలంలోని అక్కేపల్లి గ్రామాల్లోని ఇళ్లలోకి పాములు వస్తుంటాయి. ఓబీ కుప్పలు, పిచ్చి మొక్కలు, చెట్లు అధికంగా ఉండటంతోనే పాములు వస్తున్నాయని గ్రామస్థులు తెలుపుతున్నారు.

పాము అగుపిస్తే ఫోన్ చేయండి..

ఇంట్లో, పరిసరాల్లో ఎక్కడైనా పాము లు కనిపిస్తే వాటిని పట్టుకొని సురక్షిత ప్రాంతాల్లో వదిలి పెట్టడానికి మంథని ప్రాంత వాసులు స్నేక్ సత్తీ సెల్ నెం: 9059425978, కల్వచర్ల గ్రామానికి చెందిన కారెంగుల శ్రీను సెల్ నెం: 8008862433 కాల్ చేయాలి. వీరితోపాటు ఇతర ప్రాంతాల్లో పాములు పట్టే వారిని సంప్రదించాలి.

ఆసుపత్రుల్లో అందుబాటులో ఏఎస్‌వీ వాయిల్స్..

పాముకాటు గురైన వ్యక్తికి శరీరంలో విషం విరుగుడు కోసం ఇచ్చే యాంటీ స్నేక్ వీనం (ఏఎస్‌వీ) వాయిల్స్ (ఇంజక్షన్లు) జిల్లాలోని 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. పీహెచ్‌సీలతో పాటు మంథని, పెద్దపల్లి సీహెచ్‌సీలు, గోదావరిఖని ఏరియా ఆసుపత్రిలో కూడా ఏఎస్‌వీ వాయిల్స్ స్టాక్ అందుబాటులో ఉన్నాయి. పాము కాటు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటే మంచిది.

600లకు పైగా పాములను పట్టుకున్నా

నల్గొండ సతీష్ ఆలియాస్ స్నేక్ సత్తి, మంథని.



పది సంవత్సరాలుగా దాదాపు 600లకు పైగా పాములు పట్టా. వాటిలో ఎక్కువగా నాగుపాములే ఉన్నాయి. పాములను గాడుదులగండి గుట్ట సమీపంలోని అడవిలో వదిలి పెడుతా. పాములు పట్టడానికి ఎవరి వద్ద ఒక్క రూపాయి డిమాండ్ చేయను. చిన్నప్పటీ నుంచి ఆసక్తితో సొంతంగా పాములు పట్టడం నేర్చుకున్నా. వాటి వల్ల ఇప్పటి వరకు ఎలాంటి ప్రమాదానికి గురి కాలేదు.

పాముల పరిరక్షణకు ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ

కారెంగుల శ్రీను, స్నేక్ క్యాచర్, కల్వచర్ల

పాములను, వాటి నుంచి ప్రజల రక్షణ కోసం ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ సేవలందిస్తుంది. ఇండ్లల్లో, పరిసరాల్లో, రోడ్ల పై, షాపుల్లో ఎక్కడైనా పాములు కనిపిస్తే అందుబాటులో ఉన్న వలంటీర్లకు సమాచారం ఇస్తే పాములను పట్టుకొని అటవీ ప్రాంతలో వదిలి పెడుతాం. సికింద్రాబాద్‌లోని స్నేక్స్ రెస్క్యూ సెంటర్ (ఎస్‌ఆర్‌సీ) హెల్ లైన్ నెం. 837423366 కాల్ చేస్తే ఆ ప్రాంతంలో అందుబాటులో ఉన్న వలంటీర్లను పంపి పాములను పట్టి సురక్షిత ప్రాంతాల్లో వదిలి వేసే విధంగా సహాయం చేస్తారు. ఈ ఎన్‌జీవో ఆర్గనైజేషన్‌లో ట్రైనింగ్ పొందాను.

సాధారణ ప్రసవాలను పెంచాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్య సంచాలకుడు రవీంద్రనాయక్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): 75 శాతం సిజేరియన్ కాన్పులతో జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని దీనిని తగ్గించి సాధారణ ప్రసవాలు అయ్యేలా గర్భిణులను ప్రోత్సహించాలని రాష్ట్ర వైద్యఆరోగ్య సంచాలకుడు డాక్టర్ రవీంద్ర నాయక్ అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధానాసుపత్రిని రవీంద్ర నాయక్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, ప్రధానాసుపత్రి సూపరింటెండెంట్ ఎంజీ కృష్ణమూర్తి స్వాగతం పలికారు. అనంతరం రవీంద్రనాయక్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటించి వివిధ కార్యక్రమాల అమలులోని లోటుపాట్లను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నామన్నారు.



మల్యాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మాట్లాడుతున్న ఆరోగ్యశాఖ సంచాలకుడు రవీంద్రనాయక్

ఈ సందర్భంగా ఆయన పలువురు రోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారులతో సమావేశమై జిల్లాలో అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల గురించి సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రుల్లో అందుతున్న ల్యాబ్ సేవలు, ప్రసవాల గురించి తెలుసుకున్నారు. సిజేరియన్ కాన్పులను తగ్గించి సాధారణ ప్రసవాలు అయ్యేలా గర్భిణులను ప్రోత్సహించాలని ఆదేశించారు. ఆర్ఎంవో సుమన్ మోహన్‌రావు, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్యాల: మల్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని రాష్ట్ర ఆరోగ్య శాఖ సంచాలకుడు రవీంద్రనాయక్ సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలు, వైద్యశాఖ అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు, మాతా, శిశు ఆరోగ్య కార్యకలాపాలపై సమీక్షించారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అర్చన, ఏఎంవో సత్యనారాయణ, వైద్యాధికారి మౌనిక వైద్య సిబ్బంది ఉన్నారు.

కరీంనగర్ నుంచి మంచిర్యాలకు ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులు

భగత్‌నగర్/చొప్పదండి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి లక్షెట్టిపేట మీదుగా మంచిర్యాల వరకు నాలుగు ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించినట్లు కరీంనగర్-2 డిపో డీఎం ఎం.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బస్టాండ్‌లో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6:10 వరకు ప్రతీ 30 నుంచి 45 నిమిషాలకు బస్సు సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్సారార్ కళాశాలలో ఏఐపై ఉచిత శిక్షణ

గణేశ్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు ఏఐపై ఈ నెల నుంచి అంతర్జాతీయ ఉచిత శిక్షణ ఇవ్వను న్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కల్వకుంట రామకృష్ణ ఒక ప్రకట నలో తెలిపారు. ఏఐ స్కూల్, హైదరాబాద్ కళాశాల, విద్య శాఖ సం యుక్తంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాలలోని వెయ్యి మంది విద్యార్థులకు మూడు నెలలపాటు వారంతంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన పది కళాశాలల్లో ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ఒకటి అని తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం

తిమ్మాపూర్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో బ్యూటీ పార్లర్, మగ్గం ఎంబ్రాయిడరీ వర్క్స్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 11నుంచి బ్యూటీ పార్లర్‌లో, ఆగస్టు19వ తేది నుంచి మగ్గం ఎంబ్రాయిడరీ వర్క్స్‌లో శిక్షణ ప్రారంభం అవుతుందని తెలిపారు. దీనికి ఆసక్తిగల ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన 18నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న ఆసక్తిగల స్త్రీలు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849411002, 7981151653 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు పోరాడుతాం..

- ఈ నెల 8న జిల్లా కేంద్రంలో సభ
- ఎమ్మెల్సీ మధుసూదనాచారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, పక్కన ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

సుభాష్‌నగర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నలభైరెండు శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం పోరాడుతామని ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. శుక్రవారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో చింతకుంటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'మేమెంతో మాకంతా' అనే నినాదంతో 42శాతం రిజర్వేషన్ సాధిస్తామన్నారు. అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్, రూ.5 లక్షల కోట్ల నిధులు మంజూరు చేసి బీసీల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత దానిని తుంగలో తొక్కారని అన్నారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా రేవంత్‌రెడ్డి తానా అంటే తందాన అన్న చందంగా వ్యవహరిస్తోందన్నారు. తమ హయాంలో పరిష్కరించినవి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరు వాత సమస్యలుగా మారాయన్నారు. 42శాతం రిజర్వేషన్, కులగణన అటకెక్కించారన్నారు. తమిళనాడు తరహాలో శాసనసభలో బిల్లు పెట్టి దానిని ఢిల్లీకి పంపించాలని, అందుకు తాము మద్దతు తెలుపుతామని అన్నారు. షెడ్యూల్ నంబరు 9లో ఈ అంశాన్ని చేర్చాలన్నారు.

కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఏ కార్యక్రమాన్ని ప్రారంభించినా అది విజయంతమవుతుందని, ఇందులో భాగంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ సాధించడంలో భాగంగా ఈనెల 8న జిల్లా కేంద్రంలోని సర్కస్ గ్రౌండ్ (జ్యోతి బాపూలే గ్రౌండ్)లో మధ్యాహ్నం 3 గంటలకు సభ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, శాసన మండలి మాజీ చైర్మన్ కేఎం స్వామిగౌడ్, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, సతీష్ బాబు, రసమయి బాలకిషన్, సుంకే రవిశంకర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్లు తుల ఉమ, కనమల్ల విజయ, ద్యావ వసంత, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- మహాలక్ష్మీ అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన భక్తులు
- వాయినం ఇచ్చిపుచ్చుకున్న మహిళలు



వేములవాడలో అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా రాజన్న ఆలయానికి భక్తులు తరలి వచ్చారు. ఉదయాన్నే ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీరాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.

శ్రీమహాలక్ష్మి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించిన భక్తులు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. రాజరాజేశ్వరి అమ్మవారికి ఉదయం, సాయంత్రం విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం మహాలక్ష్మి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, ఒడి బియ్యం అందజేశారు. అనంతరం తులసీచెట్టుకు పూజలు చేసి వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి



ధర్మపురిలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్న మహిళలు

ధర్మపురి: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండో శుక్రవారం భక్త జన సందడి నెలకొంది. అనేక మంది భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయాల్లో ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాధికాపవన్, రాంకిషన్, విజయలక్ష్మి అందంగా అలంకరణ చేసిన అమ్మ వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా, విజయ్ లక్ష్మీ హవనం నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



రుచిత (ఫైల్)

భీమారం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందారం ఉన్నత పాఠశాలకు చెందిన బత్తుల రుచిత మెట్‌పల్లిలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అథ్లెటిక్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రుచితను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అస్పాక్ హుస్సేన్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పుల్లూరి ఉమారాణి, గ్రామ నాయకులు అభినందించారు. ఆగస్టు 3, 4 తేదీల్లో హన్మకొండ జేఎన్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ తెలిపారు.

వ్యవసాయం పేరు.. అక్రమాల తీరు



తుమ్మనపల్లి గ్రామం గుండా నంబర్ ప్లేట్ లేకుండా ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పన్ను మినహాయింపు కోసం వ్యవసాయం పేరిట ట్రాక్టర్లను కొనుగోలు చేసి వాణిజ్య అవసరాలకు వాడుతున్నారు కొందరు అక్రమార్కులు. ఇసుక, మట్టి, రాయి రవాణా వ్యాపారం జరిగే ప్రతిచోట ఈ ట్రాక్టర్లు దర్శనమిస్తుండటం గమనార్హం.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం..

వ్యవసాయం పేరుతో కొనుగోలు చేసే ట్రాక్టర్, ట్రాలీకి ప్రభుత్వం రోడ్డుట్యాక్స్ మినహాయింపు ఇచ్చింది. వ్యవ సాయ ట్రాక్టర్లను వ్యవసాయేతర పనులకు వాడటం చట్ట రీత్యా నేరం. కానీ ఆ నిబంధనలు అమలు కావడం లేదు. వాణిజ్య పరంగా కొనుగోలు చేసే ట్రాక్టర్లు, ట్రాలీకి కలిపి ఏడాదికి రూ.6వేల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ పన్ను నుంచి తప్పించుకునేందుకు ఇసుక, మట్టి, ఇటుక, రాయి వ్యాపారం చేసే వారు వ్యవసాయం పేరుతో ట్రాక్టర్లను కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్లు, ట్రాలీకి వేర్వేరు రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అనంతరం రెండింటికి రవాణా శాఖా ధికారులు వేర్వేరు అంకెలతో నంబర్ ప్లేట్లు అమర్చు తారు. వ్యవసాయం అయితే తెలుపు, వాణిజ్య అవసరాలకు పసు పు రంగు నంబరు ప్లేట్లు ఇస్తారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్ల మీద నంబర్ ప్లేట్లు లేకుండా కొన్ని ఇసుక ట్రాక్టర్లు పరుగులు తీస్తున్నాయి. మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఆయాగ్రామాల్లో వ్యవసాయం పేరుతో వాణిజ్య అవసరాలకు వాడేట్రాక్టర్లు పెద్దసంఖ్యలో ఉన్నా యి. ఆయా ట్రాక్టర్లతో రాయి, కంకర, మట్టివ్యాపారం నడిపిస్తున్నారు. ఇక్కడ ట్రాలీకి నంబర్ ప్లేట్లు లేకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం..

కంచె వేణు, ఎంవీఐ, హుజూరాబాద్

రహదారిపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. వ్యవసాయం పేరిట రిజిస్ట్రేషన్ చేసి వాణిజ్య పరంగా వాడితే అలాంటి వాహనాలపై చర్యలు తీసుకుంటాం. వాణిజ్య అవసరాలకు వాడితే తప్పనిసరిగా వాటి రూల్స్ ప్రకారంగా వాహనాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి

ఆలయ ఈవో రాధాబాయి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులతో మర్యాదపూర్వంగా ప్రవర్తించాలని సంబంధిత ఉద్యోగులు, సిబ్బందిని ఈవో రాధాబాయి ఆదేశించారు. రాజన్న ఆలయంలోని శుక్రవారం ముఖ్యమైన విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లడ్డూల విక్రయ కేంద్రం, తయారీ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పీఆర్వో ఆఫీస్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రావణ మాసంలో రాజన్న ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, భక్తులకు నాణ్యమైన లడ్డులను అందిం చాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుం డా చర్యలు చేపట్టాలని సూచించారు.

పాత బండి ఈ-బైక్‌గా మారేనండి..

- విద్యార్థి వినూత్న ఆలోచన..
- రూ.6 ఖర్చుతో 40 కిలోమీటర్ల ప్రయాణం



పాత బైక్‌కు పరికరాలను బిగిస్తున్న విద్యార్థి వంశీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : తన తండ్రి వ్యవసాయ పొలం, ఇతర పనుల నిమిత్తం పెట్రోల్ బండిపై వెళ్లేందుకు నిత్యం ఆర్థిక భారంగా మారింది. రోజుకు ఇందనానికి రూ.100 వెచ్చించాల్సి వస్తోంది. తన తండ్రికి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు వినూత్నంగా ఆలోచన చేశాడు. మూలకు పడేసిన పాత బైక్‌ను విద్యుత్ వాహనంగా తీర్చిదిద్దాడు ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి వట్టెల వంశీ. గ్రామంలోని వట్టెల సుజాత-మల్లేశం దంపతుల కొడుకు వంశీ హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యనభ్యసిస్తున్నాడు. స్వగ్రామానికి వచ్చినప్పుడు తన తండ్రి పెట్రోల్ వాహనంతో పడుతున్న అవస్థలకు చెక్ పెట్టేయాలని ఆలోచించాడు. పాత బండిని ఈ-బైక్‌గా మార్చాలని నిర్ణయించుకున్నారు.

అందుకు అవసరమైన పరికరాలను వారం రోజుల్లో సమకూర్చుకున్నాడు. పాత ద్విచక్రవాహనానికి ఉన్న ఇంజన్, సైలెన్సర్‌ను తొలగించాడు. సుమారు రూ.16 వేలతో 750 వోల్ట్ కెపాసిటీ మోటారు, 48 వోల్ట్ బ్యాటరీ, చార్జర్, డిస్‌ప్లే, లైటును కొనుగోలు చేసి అమర్చాడు. రెండు గంటల పాటు చార్జింగ్ పెడితే కేవలం రూ.6 ఖర్చుతో 40 కిలోమీటర్ల దూరం ప్రయాణించేలా రూపొందించాడు. మూలకు పడేసిన పాత బండిని తన కొడుకు తయారుచేసిన ఈ-బైక్‌పై వ్యవసాయ పనులను వెళుతున్నానని మల్లేశం పేర్కొంటున్నాడు. పెట్రోల్ ఖర్చులు ఆదా అవుతున్నాయని చెబుతున్నాడు.



ప్రోత్సహిస్తే ఈ-బైక్‌లు తయారు చేస్తా

వంశీ, బీటెక్ విద్యార్థి

తనను ప్రభుత్వం ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఈ-బైక్‌లను తయారు చేస్తాను. ఆధునిక మోడల్‌లో ఆకర్షణీయమైన వాహనాలను మార్కెటులోకి తీసుకు వస్తా. తక్కువ ఖర్చుతో ఎక్కువ కిలోమీటర్ల దూరం ప్రయాణించే బైక్‌లను రూపొందిస్తాను.



పాత బైక్‌కు పరికరాలను బిగిస్తున్న విద్యార్థి వంశీ

ఉచిత నేత్ర వైద్య శిబిరం

కోరుట్ల, అగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మశాలి భవనంలో శుక్రవారం కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్ చారిటబుల్ ట్రస్టు డాక్టర్ భాస్కర్, మెడికేర్ ఐ ఆసుపత్రి, రేకుర్తి వైస్ చైర్మెన్ చిదుర సురుష్ సహకారంతో నేత్ర వైద్య శిబిరంను నిర్వహించారు. 84 మంది నిరుపేదలకు కంటి వైద్య పరీక్షలను నిర్వహించంగా 32 మందికి శస్త్ర చికిత్స అవసరం ఉందని వైద్యులు నిర్ధారించారు. వారిని ప్రత్యేక వాహనం ద్వార రేకుర్తి అసుపత్రికి తరలించారు. అవసరం ఉన్న వారికి కళ్ల జోడు, మందులను లయన్స్ క్లబ్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ సభ్యులు గంద్ర రాధిక, గుంటుక వందన, కొత్త లౌక్య, గుంటుక కవిత, అల్లాడి శోభ, అడెపు కమల, కుందారపు ప్రేమలత, రుద్ర సుజాత, కొండబత్తిని రాధిక, లయన్స్ క్లబ్ సభ్యులు కొమ్ముల జీవన్‌రెడ్డి, గుంటుక చంద్రప్రకాష్, గంద్ర అజయేందర్ రావు అడెపు మధు, గుంటుక సురేష్ బాబు, పోతని ప్రవీణ్ కుమార్, అల్లాడి ప్రవీణ్ కుమార్, మంచాల జగన్, ఉషాకిరణ్, కొండబత్తిని కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరం



పెగడపల్లి, జగిత్యాల మండలం పోలాసలో తల్లి పాల ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెగడపల్లి, అగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : డబ్బా పాల కంటే తల్లి పాలే బిడ్డకు శ్రేయస్కరమని పెగడపల్లి మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుభద్ర, మహేశ్వరిలు పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లి పాల ప్రాముఖ్యం, పుట్టిన బిడ్డకు ముర్రుపాల ప్రయోజనాలు గూర్చి తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, బాలింతలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొలాస అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. సీడీపీఓ మమత పాల్గొన్నారు.

మల్యాల: తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని, శిశువు పుట్టగానే ముర్రుపాలు పట్టించాలని మల్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. మండలంలోని మద్దుట్లలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనురాధ, స్వరూపరాణి, జలజ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు

మెట్‌పల్లిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ అసుపత్రిలో శుక్రవారం తల్లిపాల వారోత్సవంను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పండ్లను పంపిణీ చేశారు. ఇటీవల అవార్డు అందుకున్న వైద్యులు డాక్టర్ అమరేశ్వర్ శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు, కార్యదర్శి జైపాల్, కోశాధికారి వేములవాడ చంద్రశేఖర్, ఇల్లెందుల శ్రీనివాస్, నాంపల్లి వేణుగోపాల్ పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్) లింగరామోహన్, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి మోబిన్, ఏఎన్ఎం రమ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కోరుట్ల: తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని కోరుట్ల లయన్స్ క్లబ్ సభ్యులు పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రిలోని గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కోమ్ముల జీవన్‌రెడ్డి, ఎలేటీ లక్ష్మారెడ్డి, గుంటుక సురేష్‌బాబు, అడెపు మధు, గుంటుక చంద్రప్రకాష్, అల్లాడి ప్రవీణ్‌కుమార్, మంచాల జగన్, కల్లెం గంగారెడ్డి, తునికి రాజేష్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ మున్సిపల్ పరిధిలో గల 2, 8, 9, 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, పద్మ, ఉమాదేవి, ఆశ కార్యకర్త అన్నపూర్ణ, ప్రీస్కూల్ పిల్లల తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద

జగిత్యాల, అగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం స్వల్పంగా వరద వచ్చింది. డ్యామ్‌లోకి 5,276 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యంకు గానూ ప్రస్తుతం 38.994 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

పెగడపల్లి, అగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన బోజనాన్ని అందించాలని పెగడపల్లి తహసీల్దార్ బి.రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మధ్యాహ్న బోజనాన్ని తహసీల్దార్ రవీందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం నాణ్యతతో రుచికరంగా వండి వడ్డించాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరు రిజిస్టరు పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. ప్రిన్సిపాల్ మీనాక్షి ఉన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇల్లు పనుల నిలిపివేత

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

మల్యాల, అగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం ముందు నిర్మించతలపెట్టిన ఇందిరమ్మ మోడల్ ఇల్లు పనులను నిలిపివేశారు. 'ఇదేం విచిత్రమో..!, ఎంపీడీవో కార్యాలయం ముందే ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణం' శీర్షికన సోమవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. కార్యాలయం పక్కస్థలంలో నిర్మించుటకు నిర్ణయించి, ఇళ్ల నిర్మాణం కోసం తవ్విన గోతులను పూడ్చివేయించారు.

నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి

రాయికల్, అగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సీఈవో గౌతమ్‌రెడ్డి సూచించారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి, పనులు వేగవతం చేయాలని ఆదేశించారు. అనంతరం అల్లీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహాత్మా జ్యోతిబాపూలే బాయ్స్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో చిరంజీవి ఉన్నారు.

కథలాపూర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో శంకర్‌నాయక్ సూచించారు. మండలంలోని పోసానిపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిని పర్యవేక్షించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులకు వివరించారు. బేస్‌మెంట్, గోడలు, స్లాబ్ తదనంతరం ఇళ్ల పూర్తి చేశాక బిల్లులు చెల్లింపు ఉంటుందని చెప్పారు. పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో కారోబార్ నరేశ్ ఉన్నారు.

ఫే(క్)స్ గుర్తింపు

(5వ పేజీ తరువాయి)

ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా డీపీవో నేతృత్వంలో జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అధికారులు పరిశీలన జరిపారు. జిల్లాలో పలువురు పంచాయతీ కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్ వేస్తున్నారని తేటతెల్లమైంది. తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేసిన పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలతో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో పాటు సాలరీ డిడక్ట్ చేయడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

కింది స్థాయి ఉద్యోగి నిర్వాకం వల్లే..

జిల్లాలోని బుగ్గారం మండలం చందయ్యపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన ఫేక్ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారంలో కిందిస్థాయి ఉద్యోగి నిర్వాకం వల్లే సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో అప్‌లోడ్ అయినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. సదరు కార్యదర్శి సిరికొండ పంచాయతీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే అటెండెన్స్ కోసం తన మొబైల్‌ను ఓ కిందిస్థాయి ఉద్యోగికి ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. సదరు కిందిస్థాయి ఉద్యోగి పంచాయతీ కార్యాలయంలో గల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోను ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లుగా జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులు అనుమానిస్తున్నారు. యాప్ ఇన్‌స్టాల్ చేసి, లొకేషన్ రిజిస్టర్ చేసిన మొబైల్‌ను కిందిస్థాయికి ఇవ్వడంవల్లే సంఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

బయోమెట్రిక్ అటెండెన్స్ సైతం..

జిల్లాలోని బుగ్గారం మండలంలో చందయ్యపల్లి పంచాయతీలో చోటుచేసుకున్న సంఘటనను రాష్ట్ర పంచాయతీశాఖ అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈనేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు బయోమెట్రిక్ అటెండెన్స్ సైతం వేసేలా దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే పంచాయతీల్లో బయోమెట్రిక్ మిషన్లు ఏర్పాటు చేయడం, లేదా మొబైల్‌లో బయోమెట్రిక్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయడం వంటి వాటిపై పరిశీలన చేస్తున్నారు.

సీఎంవో కార్యాలయ అధికారులు ఆరా..

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం చందయ్యపల్లి గ్రామపంచాయతీలో జరిగిన ఘటనపై సీఎంవో కార్యాలయ అధికారులు ఆరా తీస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి ఫేస్ రికగ్నిషన్ యాప్ అటెండెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోను అప్‌లోడ్ చేసిన వ్యవహారంపై సీఎంవో కార్యాలయ అధికారులు సీరియస్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. సంఘటనకు గల కారణాలు, వ్యవహారంపై జిల్లా అధికారులు తీసుకున్న చర్యలు, ఇతర వివరాలను సేకరించినట్లు సమాచారం. జిల్లా అధికారులను సంప్రందించి ఘటనపై ఆరా తీసి తీవ్రంగా పరిగణించినట్లు అధికార వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

పంచాయతీ కార్యదర్శుల హాజరులో అవకతవకలు

కార్యదర్శుల్లో ఆందోళన...

జిల్లాలో 25 మంది పంచాయతీ కార్యదర్శులు అటెండెన్స్ ట్యాంపరింగ్ చేసిన వారిలో ఉన్నారు. వీరిలో చందయ్యపల్లి కార్యదర్శి సైతం ఉన్నారు. వారందరికీ షోకాజ్ నోటీసులను ఉన్నతాధికారులు జారీ చేశారు. అయితే రాష్ట్ర స్థాయిలోనే ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ నమోదు అక్రమాలను గుర్తించడంతో పంచాయతీ కార్యదర్శుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఉన్నతాధికారులు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం.

కార్యదర్శిని సస్పెండ్ చేశాం...

- మదన్‌మోహన్, జిల్లాపంచాయతీ అధికారి



జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌పై జూలై మాసానికి సంబంధించి సూక్ష్మ స్థాయిలో పరిశీలన జరిపాము. ఇందులో 25 మంది కార్యదర్శులు తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేసినట్లు గుర్తించాము. వీరందరికి కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాలతో షోకాజ్ నోటీసులు జారీ చేశాము. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోను అప్‌లోడ్ చేసిన చందయ్యపల్లి కార్యదర్శిని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశాము.

వృద్ధుడి ఆత్మహత్య

మల్యాల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీకి చెందిన బీనవేని బాగయ్య(69) అనే వృద్ధుడు అనారోగ్యంతో వృద్ధాప్య సమస్యలతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాగయ్య భార్య పది సంవత్సరాల క్రితం మృతి చెందగా అప్పటి నుంచి మానసికంగా కుములిపోతున్నాడు. కొడుకుల వద్ద ఉంటుండగా వృద్ధాప్య సమస్యలు, భార్య లేదనే బాధతో శుక్రవారం మామిడి చెట్టుకు తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి కొడుకు జలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

ఉద్యోగ విరమణ చేసిన పలువురికి సన్మానం

జగిత్యాల అర్బన్, ఆగష్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన పలువురిని తెలంగాణ పెన్షనర్స్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన వారందరికి తమ అసోసియేషన్‌లో సభ్యత్వం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బొల్లం విజయ్, అసోసియేట్ అధ్యక్షుడు పీసీ హన్మంత రెడ్డి, కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, వెల్ముల ప్రకాశ్‌రావు, ఎండీ యాకూబ్, డిండిగాల విఠల్ పాల్గొన్నారు.

కరీంనగర్ తరలిన బీఆర్ఎస్ శ్రేణులు


సమావేశానికి తరలివెళుతున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి):స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత నాయకత్వంలో 200 మందికి పైగా ముఖ్య నాయకులు తరలివెళ్లి రిజర్వేషన్ అంశంపై సమావేశంలో మాట్లాడారు. తరలి వెళ్లిన వారిలో నాయకులు వొళ్లెం మల్లేశం, ప్రవీణ్, రాజన్న తదితరులు ఉన్నారు.

కొడిమ్యాల(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టణంలో శుక్రవారం బీఆర్ఎస్ బీసీ సమావేశం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షతన నిర్వహించగా కొడిమ్యాల మండలానికి చెందిన పలువురు బీసీ బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యకర్తలు తరలివెల్లారు. తరలి వెల్లిన వారిలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, రైతు నాయకుడు రాజేందర్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ బలుకం మల్లేశంయాదవ్, కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ లింగాగౌడ్, మాజీ సర్పంచు అక్కపెల్లి రాజేశం ఉన్నారు.

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించే బీసీ గర్జన విజయవంతం చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కోరారు. పట్టణంలోని బీసీ సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కరీంనగర్‌లో సన్నాహక సమావేశంలో పాల్గోనడానికి ప్రత్యేక వాహనాల ద్వారా బయలుదేరి వెళ్లారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

రాయికల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన గంగారెడ్డి తన ఎక్సెల్ ద్విచక్రవాహనంలో ఉన్న స్మార్ట్ ఫోన్‌ను దొంగిలించారు గంగారెడ్డి వెంటనే కిష్టంపేట మాజీ సర్పంచ్ జాన స్వరూప గోపి, ఉప సర్పంచ్ చింతలపెల్లి రాజేశ్వర్ రెడ్డి, ఆకుల శ్రీనివాస్‌లను సంప్రదించగా వెంటనే రాయికల్ ఎస్సై సుధీర్ రావుకు ఫిర్యాదు చేశారు. ఎస్సై చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకుని స్మార్ట్ ఫోన్ రికవరీ చేసి గంగారెడ్డికి శుక్రవారం అందించారు.

నానో యూరియాతో తక్కువ ఖర్చు, అధిక దిగుబడి

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వాడడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి దీపిక అన్నారు. శుక్రవారం మండలంలోని చౌలమద్ది గ్రామంలోని రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో నరేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు బీమా కలిగి ఉండాలి

కొడిమ్యాల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరు బీమా కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజినల్ హెడ్ శ్రీలత కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ శాఖా కార్యాలయంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ రీజినల్ హెడ్ మాట్లాడుతూ ఏదైనా బ్యాంక్, పోస్టాఫీస్‌లో ఖాతా కలిగి 18సంవత్సరాల నుండి 70సంవత్సరాలలోపు ఉన్న వారంతా ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజనకు అర్హులన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఎల్‌డీవో యశ్వంత్‌సాయి, లీడ్ బ్యాంక్ మేనెజర్ రాంకుమార్, ఆర్‌పీబీడీ హెడ్ వైభవ్ సిసోడియా, యూబీఐ మేనెజర్ సంజీవ్‌కుమార్, టీజీబీ మేనెజర్ సురేష్, ఎఫ్ఎల్సీ మదు సూధన్, ఫీల్ ఆఫీసర్ గజానన్, సెర్ప్ సీసీలు వీరకుమార్, మంగ, స్వరూప, గోల్డ్ అప్రైజర్ స్వామి పాల్గొన్నారు.

ఉచిత ఏఐ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) శిక్షణను కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఏఐలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ గురించి ఏఐ స్కూల్ హైదరాబాద్, కళాశాల విద్యాశాఖ శుక్రవారంనిర్వహించిన ఆన్‌లైన్ మీటింగ్‌లో ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ పాల్గొన్నారు. కళాశాలలో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో మూడు నెలలపాటు శిక్షణ ఉంటుందని, వారాంతంలో క్లాస్‌లు నిర్వహించబడుతాయని పేర్కొన్నారు. ఈ కోర్సు వలన కళాశాల విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని తెలిపారు. ఈ మేరకు ఏఐ స్కూల్ హైద్రాబాద్‌తో కళాశాల విద్యాశాఖ ఒప్పందం కుదుర్చుకొందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పది కళాశాలలను ఎంపిక చేస్తే దానిలో జగిత్యాల ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ఒకటిగా ఎంపికకావడం సంతోషకర విషయమని తెలిపారు.

ఎమ్మెల్యే అసత్య ఆరోపణలు మానుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణరావు

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): యూరియా పంపిణీపై కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జువ్వాడి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమామే ధ్యేయం గా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. యూరియా పంపిణీపై ఎమ్మెల్యే ఆగస్టు 2న కోరుట్ల మండలంలోని అయిలాపూర్ రైతు వేదిక వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, వెంకటేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రాజేశ్వర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ యూరియాపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, సింగిల్ విండో చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు తిరుపతిరెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయిని సురేష్‌గౌడ్,రవీంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బహిరంగ చర్చకు రావాలని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఏలాల వెంకటరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బాస శ్రావణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దుదిగమ గంగాధర్ పాల్గొన్నారు .

కోరుట్ల రూరల్: యూరియాపై తప్పు ప్రచారం చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ బహిరంగ చర్చకు సిద్ధమా అని మార్కెట్ కమిటీ చెర్మన్ పన్నాల అంజిరెడ్డి, పట్టణ, మండల అధ్యక్షుడు తిరుమల గంగాధర్, కొంత రాజం అన్నారు.

క్రీడాకారులు యాంటీ డ్రగ్స్ వారియర్‌గా పనిచేయాలి


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) :క్రీడల ద్వారానే వ్యసనాలకు చెక్ పెట్టవచ్చునని ప్రతీ క్రీడాకారుడు యాంటీ డ్రగ్స్ వారియర్‌గా పనిచేయాలని ఎస్పీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ క్రీడా మైదానంలో నిర్వహించిన టోర్నమెంట్‌ను బెలూన్లను గాల్లోకి వదిలి ఎస్పీ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. జిల్లా పోలీసులకు, యువతకు సత్సంబంధాలు మెరుగుప రచాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహించామన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతీ క్రీడాకారుడు యాంటీ డ్రగ్స్ వారియర్‌గా పనిచేసి డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడం లో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీ డీఎస్పీ వెంకటరమణ, సైబర్ క్రైం డీఎస్పీ వెంకటరమణ, జగిత్యాల, మెట్‌పెల్లి డీఎస్పీలు రఘుచందర్, రాములు, ఆర్‌ఐలు కిరణ్ కుమార్, వేణు. సైదులు, డీసీఆర్‌బీ, ఎస్‌బీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శ్రీని వాస్, ఆరీఫ్‌అలీ ఖాన్, శ్రీనివాస్, సీఐలు కరుణాకర్, అనిల్‌కుమార్, సుధాకర్, రాంనర్సింహా రెడ్డి, సురేష్ తదితరులు ఉన్నారు.

● జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు నిర్వహించిన వాలీబాల్ పోటీలు హోరా హోరీగా ముగిసాయి. జిల్లావ్యాప్తంగా ధర్మపురి, జగిత్యాల, జగిత్యాల రూరల్, జగిత్యాల టౌన్, కోరుట్ల, మల్యాల, మెట్‌పల్లి సర్కిల్‌కు చెందిన ఏడు టీంలు తలపడ్డాయి. మొదటి స్థానంలో నిలిచిన కోరుట్ల సర్కిల్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 10 వేల నగదు బహుమతిని ఎస్పీ అశోక్‌కుమార్ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన మెట్‌పల్లి సర్కిల్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 7 వేల నగదు బహుమతి, తృతీయ స్థానంలో నిలిచిన ధర్మపురి సర్కిల్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ. ఐదు వేల నగదు బహుమతిని ఎస్పీ అందజేసి క్రీడాకారులను అభినందించారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని పేర్కొన్నారు. జగిత్యాల, మెట్‌పెల్లి డీఎస్పీలు రఘు చందర్, రాములు తదితరులు ఉన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ధర్మపురి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గోదావరి సమీపంలో మురుగు నీరు సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలను మున్సిపల్ అధికారులు తీసుకున్నట్లు ధర్మపురి లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ తెలిపారు. శుక్రవారం గోదావరి శివారులో గల మురికి నీరు కాలువ సమస్య పరిష్కారానికి మున్సిపల్ సిబ్బంది అవసరమైన పనులు చేపట్టారు. గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించడానికి రాకపోకలు చేస్తున్న సందర్భాల్లో సంబంధిత మురుగు నీరు కాళ్లకు తగిలి ఇబ్బంది ఎదుర్కొంటున్న వ్యవహారాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకవెళ్లగా స్పందించిన అధికారులు సంబంధిత మురికి కాలువపై చెక్కలతో వంతెన మాదిరిగా ఏర్పాటు చేసి పరిష్కారానికి అవసరమైన పనులు పూర్తి చేశారని తెలిపారు.

ఎంపీవోకు సన్మానం

కోరుట్ల రూరల్, అగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల ఎంపీవోగా పని చేసిన కృపాకర్ ఎంపీడీవోగా పదోన్నతి పొంది వెల్గటూర్‌కు బదిలీపై వెళ్లగా ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ రాష్ట్ర నాయకుడు చిట్నేని రఘు అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పడకేసిందన్నారు. వర్షకాలం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో దోమల బెడదతో పాటు ఇతర సమస్యలతో ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో సర్పంచ్, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతీ స్థానాన్ని గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీపై సంవత్సరన్నర కాలంలోనే వ్యతిరేకత వచ్చిందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోరుట్ల అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు శ్రావణ శుక్రవారం శోభ


పొలాస లలితామాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జగిత్యాలరూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం పురష్కరించుకొని మహిళలు, భక్తులు జగిత్యాల మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయాల్లో శ్రాశణ శుక్రవారం సందడి నెలకొంది. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస శ్రీచక్ర సహిత లలితామాత ఆలయంలో శుక్రవారం పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు చేసి ఒడిబియ్యం సమర్పించారు. శ్రీలలితా మాత ఆలయంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూపసత్తయ్య ఆధ్వర్యంలో లలితాసహస్రనామ పారాయణం గావించి భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించి దర్శించుకున్నారు.

కోరుట్ల (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ఆలయాల్లో శుక్రవారం శ్రావణ మాస వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అష్టలక్ష్మి దేవాలయంలో అమ్మవారికి పసుపు కొమ్ములతో అర్చకులు మధుసూదనాచారి, పెరంబదూరి శ్రీనివాస్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని కాల్వగడ్డ అంజనేయ స్వామి దేవాలయంలో వేదపండితుడు పాలెపు రామకృష్ణ శర్మ, వినయ్ శర్మ మంత్రోచ్చరణ మధ్య వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రావణ మాసం వేడుకలు భక్తులు, ఆలయ నిర్వాహకులు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలోని సోమేశ్వరాలయంలోని స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. స్వామి వారిని దర్శించుకుని శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేసి రంగుల పూలతో అలంకరించి శివుడికి బిల్వపత్రిని సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మ వారికి ప్రత్యే అభిషేకాలు, అర్చనలు, కుంకుమ పూజలు జరిపి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల్లో నెయ్యితో దీపాల్ని వెలిగించారు.